సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 24 । ఆగస్టు । 2023



పట్టు చిక్కింది
పట్టుగూళ్ల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. హిందూపురం మార్కెట్‌లో బైవోల్టిన్ రకం కిలో రూ.600కు పైగా పలుకుతున్నాయి.
IIలో



ప్లాస్టిక్‌తో పెనుముప్పు
ప్లాస్టిక్‌తో పెనుముప్పు కలుగుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఏరివేతను ఆయన ప్రారంభించారు.
IIలో

గరిష్ఠం/కనిష్ఠం
36.4°/24.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కబోత పెరిగింది. ఆకాశం మేఘావృతమైనా ఎక్కడా వర్షం కురవలేదు.

న్యూస్‌రీల్

ఫైళ్లన్నీ క్లియర్ కావాల్సిందే
- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన జేసీ కేతన్‌గార్గ్



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్‌కు సంబంధించిన పెండింగ్ ఫైళ్లన్నీ క్లియర్ చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా నియమితులైన ఆయన.. బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయనకు జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ, అన్ని విభాగాల ఏఓలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం వారితో కేతన్‌గార్గ్ కాసేపు మాట్లాడారు. ఈ నెల 26న జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశంపై ఆరా తీశారు. సమావేశం తరువాత అన్ని విభాగాల ఏఓలతో వేర్వేరుగా సమీక్షిస్తానని, ఫైళ్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్కటీ పెండింగ్‌లో ఉండడానికి వీల్లేదన్నారు. జిల్లా పరిషత్ ప్రతిష్ట పెంచేందుకు ఉద్యోగులందరూ కష్టపడి పని చేయాలని సూచించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



మొక్కలు నాటుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కదిరి టౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు ఆరా తీశారు. మట్కా, లాటరీ, జూదం, మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీలత, సీఐ మధు, ఎస్‌ఐలు ఉన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై నిరంతర నిఘా

గాండ్లపెంట: ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిరంతర నిఘా ఉంచాలని, ముందస్తు చర్యలతో శాంతిభద్రతలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, కోర్టు కేసుల వివరాలు, నేర విభాగానికి సంబంధిని రికార్డులు పరిశీలించారు. అనంతరం మండలంలో నెలకొన్న తాజా పరిస్థితుల గురించి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట కదిరి డీఎస్పీ శ్రీలత, కదిరి రూరల్ సీఐ శివశంకర్‌నాయక్ ఉన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పెనుకొండ: నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో సెప్టెంబర్ 1 నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (నాన్ వాయిస్ డొమెస్టిక్) డేటా ఎంట్రీ కోర్సుల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు స్కిల్ హబ్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9676706976 నంబర్లో సంప్రదించాలన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు



బెళుగుప్ప: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి లిఫ్టుల ద్వారా హంద్రీ–నీవా కాలువ గుండా ప్రవహిస్తున్న కృష్ణా జలాలు బుధవారం జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి. జీడిపల్లి రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 1.68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.55 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఏఈ సఫ్రుద్దీన్ తెలిపారు. కృష్ణాజలాలు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జయహో.. భారత్









కొత్తచెరువు నెహ్రూ కూడలిలో సంబరాలు చేస్తున్న యువకులు, బుక్కపట్నంలో జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది

- చంద్రయాన్–3 సక్సెస్
- చంద్రుడి దక్షిణ ధ్రువంపై సేఫ్‌గా ల్యాండ్ అయిన విక్రమ్ ల్యాండర్
- చరిత్రాత్మక ఘట్టాన్ని తిలకించి విద్యార్థుల కేరింతలు
- జిల్లా వ్యాప్తంగా సంబరాలు.. మిన్నంటిన జయహో భారత్ నినాదాలు
- ఇస్రో శాస్త్రవేత్తల కృషిపై ప్రజాప్రతినిధులు, మేధావుల ప్రశంసల జల్లు

సాక్షి నెట్‌వర్క్: ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో ఉప్పొంగింది. 41 రోజుల ప్రయాణం తర్వాత విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై కాలుమోపగానే దేశమంతా సంతోషంలో మునిగిపోయింది. అగ్ర దేశాలే విఫలమైన చోట... ఎవరూ చూడని, అడుగుమోపని చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత్ తొలి అడుగు వేసింది. అంతరిక్షరంగంలో సువర్ణాక్షరాలతో సరికొత్త చరిత్రను లిఖించింది. బుధవారం సాయంత్రం 6:04 గంటలకు విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్ కాగానే విశ్వమంతా జయహో భారత్ అంటూ నినదించింది.

చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటాయి. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఇంటింటా టీవీల్లో వీక్షించారు. స్కూళ్లలోనూ భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి వీక్షించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. దేశ భక్తిని చాటుతూ త్రివర్ణ పతాకంతో యువకులు వీధుల్లో ఉత్సాహంగా తిరిగారు. కొత్తచెరువులోని నెహ్రూ కూడలిలో విద్యార్థులు జాతీయ జెండాలతో మానవహారంగా ఏర్పడి జై భారత్, జైజై భారత్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులు, యువకులు, మేధావులు కేక్‌కట్ చేసి బాణసంచా పేల్చుతూ డప్పు వాయిద్యాల మధ్య సంబరాలు చేసుకున్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు..

చంద్రయాన్–3 విజయవంతం కావడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటాయి. చంద్రుడిపై చారిత్రక ఘట్టాన్ని టీవీల్లో చూసిన విద్యార్థులు కేరింతలు కొట్టారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో భారత్ అగ్రగామిగా నిలవడం గర్వకారణమని మేధావులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు గర్వంగా చెప్పుకోదగ్గ ఘట్టమని కీర్తించారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని ప్రశంసించారు.

సాంకేతిక రంగానికి పెద్ద ఊతం



భారతదేశం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. చంద్రయాన్–3 విజయవంతమే ఇందుకు ఉదాహరణ. చంద్రునిపై అద్భుతమైన ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు కృషి చేసిన భారత ప్రభుత్వానికి, ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. – దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్టపర్తి

నూతన శకానికి నాంది



భారతదేశ అంతరిక్ష చరిత్రలో చంద్రయాన్–3 ప్రయోగం ఓ గొప్ప మలుపు. ఇది నూతన శకానికి నాంది పలికింది. అంతరిక్ష రంగంపై విద్యార్థులకు ఎంతో ఆసక్తి కలుగుతుంది. అలాగే సైన్సుపై ఆసక్తి, శాస్త్రీయ పరిశీలనా స్ఫూర్తిని పెంపొందిస్తుంది. భారతదేశం గర్వించదగ్గరోజిది.

– డాక్టర్ రాంమూర్తి, జేవీవీ జిల్లా కార్యదర్శి

ప్రతి పౌరుడూ గర్వించదగ్గ రోజు



విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై సేఫ్‌గా ల్యాండ్ అయినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించగానే నా హృదయం గర్వంతో ఉప్పొంగింది. అగ్రదేశాలకు చేతగాని పని మనం చేసి చూపించాం. ఈ ఘనతతో ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరుడూ గర్విస్తున్నాడు. ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతున్నా.

– ఎన్వీ మురళీధర్‌బాబు, ప్రిన్సిపాల్, ఏపీఆర్ ఎక్స్‌లెన్స్ కొడిగెనహళ్లి, పరిగి మండలం

ప్రతి భారతీయుడికీ గర్వకారణం



చంద్రయాన్–3 విజయవంతం సరికొత్త అధ్యాయం. అగ్ర రాజ్యాలు సాధించలేని ఘనత మనం సాధించాం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మన సత్తా చాటాం. నిజంగా ప్రతి భారతీయుడూ గర్వపడేరోజు ఇది. ఇందుకు కారణమైన ఇస్రో శాస్త్రవేత్తలకు, భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. – అరుణ్‌బాబు, కలెక్టర్

మన సత్తా తెలిసింది



విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై సేఫ్‌గా ల్యాండ్ కావడంతో ప్రపంచ దేశాలకు భారత్ సత్తా తెలిసింది. నిజంగా ఇది మరచిపోలేని రోజు. రెండురోజుల క్రితం అగ్రరాజ్యం రష్యా విఫలమైన చోట మనం సత్తా చాటాం. ఈ ఘనతకు కారణమైన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు.

– మాధవరెడ్డి, ఎస్పీ

చరిత్రపుటల్లో నిలిచిపోతోంది



చంద్రయాన్–3 విజయవంతంతో దేశఖ్యాతి చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. అంతరిక్షరంగంలో భారత్ మాత్రమే సాధించిన ఘనత ఇది. ప్రపంచ దేశాలకు మనం ఎందులో తీసిపోమని మరోసారి నిరూపితమైంది. నిజంగా భారతీయులందరూ గర్వించదగ్గ రోజిది. ఈ మిషన్‌లో పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు.

– రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ

కథలు చెబితే.. మీ కథ తేలుస్తా



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

- ఐసీడీఎస్ అధికారులను హెచ్చరించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని వెల్లడి
- హిందూపురం, ఓడీసీ, పెనుకొండ, బత్తలపల్లి సీడీపీఓలపై క్రమశిక్షణ చర్యలు

పుట్టపర్తి అర్బన్: ''నాకు కథలు చెప్పొద్దు.. ఏమడిగినా సమాధానం సరిగా రావడం లేదు. అసలు మీరు పనిచేస్తున్నారా..? సమగ్ర సమాచారం లేకుండా సమీక్షకు ఎలా వచ్చారు...? కథలు చెబితే.. మీ కథ తేలుస్తా''అంటూ ఐసీడీఎస్ అధికారులపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారితో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో అంగన్‌వాడీల పనితీరుపై సమీక్షించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు, పిల్లల పెరుగుదల, బరువు తక్కువగా ఉన్న పిల్లల కోసం తీసుకున్న చర్యలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలోని 96,856 మంది పిల్లల బరువు గుర్తించినట్లు యాప్‌లో నమోదు చేశారని, ఇందులో 78,981 మంది పిల్లలు బరువు పెరిగినట్లు, తక్కిన 2,749 మంది బరువు తగ్గినట్లు పేర్కొన్నారన్నారు. దీనిపై కలెక్టర్ ఆయా ప్రాజెక్టుల సిబ్బందిని ప్రశ్నించగా... ఎవరి నుంచీ సరైన సమాధానం రాలేదు. దీంతో కలెక్టర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మీరు ఉద్యోగాలు చేస్తున్నారా.... లేదా అని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం, నివేదిక సమర్పణలో బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శించిన హిందూపురం, ఓడీసీ, పెనుకొండ, సీడీపీఓలతో పాటు సమావేశానికి గైర్హాజరైన బత్తలపల్లి సీడీపీఓపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశాలకు వచ్చే అధికారులు సమగ్ర, వాస్తవ సమాచారంతో హాజరు కావాలన్నారు. మరోసారి జరిగే సమావేశంలో లక్ష్య సాధన దిశగా నివేదికలు సమర్పించాలన్నారు. ఆ విధంగా జరగని పక్షంలో అధికారులతో పాటు సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తప్పవన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తా..

ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ మెనూ ప్రకారం పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. త్వరలోనే తాను అంగన్‌వాడీల తనిఖీలకు వస్తానని, పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినట్లు తేలినా, విధుల్లో అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొదటి 15 రోజుల పోషకాహారాల పంపిణీ పూర్తి స్థాయిలో జరగాలన్నారు. దీనిపై ప్రతి నెలా చివరి వారంలో ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ క్షుణ్ణంగా జరగాలన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే సహించేది లేదని హెచ్చరించారు. ఇక నుంచి ప్రతి నెలా ఐసీడీఎస్ పురోగతిపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

టంగుటూరి జీవితం ఆదర్శప్రాయం

- జయంతి వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్య్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచిన ధీరోదాత్తుడు టంగుటూరి అని కొనియాడారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ప్రకాశం పంతులు 152వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. సేద్యపు నీటి ప్రాజెక్టులు, కృష్ణానదిపై విజయవాడలో బ్యారేజీ, వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపనకు కృషి చేశారన్నారు. సత్యాగ్రహ, క్విట్ ఇండియా, ప్రత్యేకాంధ్ర ఉద్యమాల్లో టంగుటూరి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రకాశం పంతులు ధైర్య సాహసాలకు మెచ్చి ఆయనకు 'ఆంధ్రకేసరి' బిరుదునిచ్చి గౌరవించారన్నారు. ఆ మహనీయుడి జయంతిని అధికారికంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, 'పుడా'చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ ఎ. రమణారెడ్డి, హాస్టల్ వార్డెన్ రాజ్‌కుల్లాయప్ప, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రతి క్లెయిమ్‌నూ పరిష్కరిస్తాం

'ఓటరు జాబితా ప్రత్యేక సవరణ–2024'కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వేలో అందిన ప్రతి క్లెయిమ్‌నూ పరిష్కరిస్తామన్నారు. 2022 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 9 వరకూ వచ్చిన డెత్, షిఫ్టింగ్ కేసులను పరిశీలిస్తామన్నారు. సర్వే పునఃపరిశీలన కోసం ప్రతి నియోజకవర్గానికీ ఒక ప్రత్యేకాధికారిని నియమించామన్నారు. నోటీసు అందించిన తర్వాతే ఓటు తొలగింపు ప్రక్రియ చేపడతామన్నారు. 2024 జనవరి 5వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు పలు అంశాలు ప్రస్తావించగా, తప్పకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రంగారెడ్డి, వేమయ్య, గంగాధర్, వెంకటేషు, కుల్లాయప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముద్దచర్మానికి ముందస్తు టీకా

- లంపీ స్కిన్ వ్యాధి నివారణకు చర్యలు
- భారీగా టీకాలు వేసేందుకు సిద్ధమైన సర్కార్
- ఇప్పటికే జిల్లాకు 2.81 లక్షల డోసులు
- ఈ నెల 31వ తేదీ వరకూ ప్రత్యేక డ్రైవ్



పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలో టీకాలు వేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) లంపీ స్కిన్ వ్యాధి సోకిన పశువు

పుట్టపర్తి అర్బన్: పాడిపశువులకు ప్రాణాంతకంగా మారిన లంపీ స్కిన్ (ముద్దచర్మం) వ్యాధికి ముకుతాడు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముందస్తుగానే టీకాలు వేసి పాడిపశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచుతోంది. ఇందుకోసం పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ఇప్పటికే పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి టీకాలు ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే గొర్రెలు, మేకలకు పారుడు రోగం, నీలి నాలుక వ్యాధికి టీకాలు అందజేసి సంరక్షిస్తోంది. తాజాగా ప్రాణాంతకమైన లంపీ స్కిన్ వ్యాధి నివారణకూ ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ జిల్లాలో వ్యాధి లక్షణాలు కనిపించకున్నా... ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలు వేసే కార్యక్రమం చేపట్టింది.

ప్రమాదకరమైన వ్యాధి..

లంపీ స్కిన్ (ముద్దచర్మం) వ్యాధిని తొలిసారిగా 1992లో ఆఫ్రికా ఖండంలోని జాంబియాలో గుర్తించారు. 2019లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ లంపీ స్కిన్ కేసులు నమోదయ్యాయి. 2022లో జిల్లాలో సుమారు వంద పశువుల మృత్యువాత పడ్డాయి. ముఖ్యంగా ఆవులు, దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు చర్మంపై బుడిపెలు, దద్దుర్లు, ఏర్పడతాయి. ఇది వైరస్ ద్వారా పాడిపశువులకు వ్యాపిస్తుంది. వైరస్ సోకిన పశువుల్లో 10 రోజుల్లోపు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. 105 డిగ్రీల వరకూ జ్వరం వస్తుంది. చర్మం ముద్దగా మారుతుంది. దీంతో పశువులు మేత, నీరు తీసుకోవడం నిలిపివేస్తాయి. కళ్లు, ముక్కు నుంచి నీళ్లు కారుతాయి. ముట్టెమీద, నోటి దూలం లోపల బుడిపెలు వస్తాయి. మెడ, తొడ దగ్గర లింప్ గ్రంథులు వాస్తాయి. పశువుల చర్మంపై బుడిపెలు ఏర్పడి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే...పశువులు మేత మేయక పాలు పూర్తిగా తగ్గిపోతాయి. చర్మంతో పాటు పొదుగు, బాహ్య జననేంద్రియాలపై దద్దుర్లు కనిపిస్తాయి. నొప్పి అధికంగా ఉండి పాలు పితకనీయవు. అయితే సకాలంలో వైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి సోకిన పశువుల్లో 1 నుంచి 5 శాతం వరకూ మృత్యువాత పడవచ్చు. ఒక గ్రామంలో అన్ని పశువులకూ వైరస్ సోకితే ప్రమాద స్థాయి పెరుగుతుందని పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో పాడి ఆవులు, దూడలు :
2,81,206

ఇప్పటి వరకూ వేసిన టీకాలు:
1,48,500

దూడలకూ టీకాలు..

జిల్లాలో పాడిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. లక్షలాది మంది రైతులు పాడినే ఆధారంగా చేసుకొని జీవిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 3.25 లక్షల పాడి ఆవులు, గేదెలు ఉన్నాయి. లంపీ స్కిన్ వ్యాధి గేదెల్లో ఎక్కువగా కనిపించనప్పటికీ అధికారులు పాడిఆవులతో పాటు 4 నెలలపైన వయస్సు కలిగిన దూడలకూ టీకాలు వేస్తున్నారు.

1.5 లక్షల టీకాలు వేశాం



లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు ముందుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ప్రస్తుతం టీకాల పంపిణీ కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. ఈనెలాఖరు వరకూ అన్ని పశువుల ఆస్పత్రుల్లో ఉచితంగా టీకాలు వేస్తారు. ప్రతి పాడి రైతూ తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలి. ఇప్పటికే జిల్లాలోని 1.5 లక్షల పశువులకు టీకాలు వేశాం.

– సుభదాస్, పశు సంవర్ధకశాఖ అధికారి

సికింద్రాబాద్-కొల్లం మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: ఓనమ్ పండగ, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 25, 27వ తేదీల్లో సికింద్రాబాద్–కొల్లం–సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25 శుక్రవారం సాయంత్రం 5.50 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ బయలుదేరిన రైలు (07119) నుంచి బయలుదేరి రాయచూర్, మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, వైఎస్సార్ కడప, రేణిగుంట, కాట్పాడి మీదుగా శనివారం రాత్రి 11.30 కొల్లం చేరుతుంది. తిరిగి ఈ రైలు (07120) కొల్లం జంక్షన్ నుంచి ఆదివారం సాయంత్రం 7 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 11.50 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది.

క్లుప్తంగా

అమ్మను మించిన దైవం లేదు

- సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ



మాతృమూర్తి జయలక్ష్మీమాతా విగ్రహానికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

రాప్తాడు/అనంతపురం కల్చరల్: తల్లిని మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ తల్లిని ప్రేమించి, పూజించి ధన్యులు కావాలని మైసూరు దత్త పీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. రాప్తాడు మండలం బొమ్మేపర్తి (జయలక్ష్మీపురం)లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో బుధవారం తన మాతృమూర్తి జయలక్ష్మీమాతా, అన్నపూర్ణేశ్వరి మాతా విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. అంతకు ముందు ఆశ్రమానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం 40 గదులతో నిర్మించిన సహస్ర చంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. నూతన బృందావనంలో వనమూలికా వృక్షాలు, పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాతృ స్వరూప ఔచిత్యం, దానధర్మాల విశిష్టతను వివరించారు. తల్లి ఔనత్యాన్ని వివరిస్తున్న సమయంలో కొంత ఉద్వేగానికి లోనయ్యారు. దత్తాత్రేయ సంప్రదాయానికి అందరూ వారసులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విమలాశాంతి పురస్కారానికి రాచపాలెం ఎంపిక



రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న విమలాశాంతి పురస్కారానికి ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు విమలాశాంతి సాహిత్య సేవా సమితి చైర్మన్ డాక్టర్ శాంతి నారాయణ బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది సాహితీ విమర్శకుల రంగానికి సంబంధించి అందిన ఎంట్రీలను జ్యూరీ సభ్యులు ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య మేడిపల్లి రవి కుమార్, అట్టాడ అపల్నాయుడు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ పరిశీలించి అనంత సాహితీ కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ సాహితీ విమర్శకులు రాచపాలెం చంద్రశేఖర రెడ్డిని విమలాశాంతి సాహిత్య జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అమరాపురం: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురం మండలం గౌడనకుంట గ్రామానికి చెందిన ఈరలింగప్ప (52) కంటి చూపు సరిగా కనబడదు. అయినా రోజూ పొలానికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకెళ్లి పరిశీలించారు. అప్పటికే బావిలో విగతజీవిగా తేలియాడుతున్న ఈరలింగప్పను గుర్తించి వెలికి తీశారు. మృతుడి సోదరుడు సిద్దేశ్వర ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

‘పట్టు’ చిక్కింది

- బహిరంగ వేలాల్లో ఆశాజనక ధరలు
- క్వింటా రూ.600 పైమాటే



పట్టుగూళ్ల మార్కెట్‌లో వేలం పాటలో పాల్గొన్న వ్యాపారులు

హిందూపురం: పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా పెరిగాయి. మూడునెలల క్రితం వరకూ అంతంతా మాత్రంగా ఉన్న ధరలు ఒక్కసారిగా ఊహించని రీతిలో పుంజుకుని రెండింతలయ్యాయి. ప్రస్తుత ధరలు ఇలాగే కొనసాగుతాయని రీలర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనంతగా..

గతంలో ఎన్నడూ లేనంతగా ధరలు పెరగడంతో పట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకూ పట్టుగూళ్లకు సరైన ధర లేక చాలా మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించారు. దీనికి గత ప్రభుత్వంలో రైతులకు సరైన ప్రోత్సాహకాలు సైతం అందేవి కాదు. రాయితీలను సైతం చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వకుండా మోసం చేస్తూ వచ్చింది. దీంతో అప్పట్లో రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పట్టు రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయి. సకాలంలో ప్రోత్సాహకాలను అందజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా నిలిచింది. ఈ క్రమంలో ధరలు సైతం ఆశాజనంగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా పట్టు సాగు విస్తీర్ణం క్రమేణ పెరుగుతూ వచ్చింది. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు రోజూ 6 నుంచి 7వేల క్వింటాళ్లకు పైగా పట్టుగూళ్లు వచ్చేవి. ప్రస్తుతం తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి 3,500 నుంచి 5వేల క్వింటాళ్లు చేరుతున్నాయి. ప్రస్తుతం హిందూపురం మార్కెట్‌లో గరిష్ఠంగా క్వింటా రూ.650 నుంచి కనిష్ఠంగా రూ.573తో అమ్ముడు పోతున్నాయి. హిందూపురం, మడకశిర, గుడిబండ, సోమందేపల్లి, పెనుకొండ, లేపాక్షితో పాటు చిత్తూరు, కుప్పం, తెలంగాణ నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ఈ నెలలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా..

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం	సగటు
16వ	రూ.411	రూ.620	రూ.529
17వ	రూ.422	రూ.638	రూ.563
18వ	రూ.405	రూ.621	రూ.543
19వ	రూ.448	రూ.631	రూ.544
20వ	రూ.402	రూ.605	రూ.554
21వ	రూ.465	రూ.642	రూ.565
22వ	రూ.429	రూ.640	రూ.581
23వ	రూ.436	రూ.635	రూ.573

ధరలు పెరుగుతున్నాయి



రెండు నెలల క్రితం కొంత మేర ధర తగ్గింది. ప్రస్తుతం పెరిగిన ధర సంతృప్తికరంగా ఉంది. ఈ మూడేళ్లలోనే పట్టు రైతులు లాభాలను చూస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఎంత కష్టపడినా కిలో ధర రూ.400 దాటేది కాదు. ఇప్పుడు ధరలు బాగున్నాయి.

– వసంత్‌కుమార్, హెచ్‌ఆర్ పల్లి, మడకశిర

రెండింతలు పెరిగాయి



నాణ్యమైన బైవోల్టిన్ పట్టుగూళ్లకు మంచి డిమాండ్ ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా దిగుబడి రాలేదు. దీంతో ధరలు పెరిగాయి. ఏళ్ల తరబడి నష్టాలు ఎదుర్కొన్న మేము ఈ మూడేళ్లుగా కొంత మేర లాభాన్ని చూస్తున్నాం. గతంతో పోల్చుకుంటే ధరలు రెండింతలు పెరిగాయి.

– ప్రభాకర్‌రెడ్డి, వెంకటాంపల్లి, కుందుర్పి మండలం

నాణ్యమైన పట్టుగూళ్లకు డిమాండ్



పట్టుగూళ్లు నాణ్యతగా ఉంటే ధర కూడా ఆశాజనకంగా ఉంటుంది. గూళ్లను కనీసం 8, 9 రోజుల్లోపు మార్కెట్‌కు తరలిస్తే మంచి ధరతో అమ్ముడు పోతాయి. ఎక్కువ మంది రైతులు త్వరగా మార్కెట్‌కు తరలిస్తే బరువు తూగుతుందని 4, 5రోజులకే మార్కెట్‌కు తెస్తారు. గూళ్లలో తేమశాతం కారణంగా ధర తగ్గుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి.

– సురేష్, సెరికల్చర్ ఏడీ, హిందూపురం

ఆంధ్రకేసరికి ఘన నివాళి



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: బ్రిటీష పాలకుల తుపాకీకి తన రొమ్ము చూపి సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించిన ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటంతో పాటు వ్యవహారిక బాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి (ముందస్తు జయంతి) చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డితో పాటు అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, ఆర్ఐలు టైటాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ 1928లో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో ప్రకాశం పంతులు సాగించిన పోరాట పటిమను కొనియాడారు. ఆ మహనీయుడి బాట అందరికీ అనుసరణీయమన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు



పోటీలకు సిద్ధం చేసిన మైదానం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని జగరాజుపల్లి క్రాస్‌లోని ఏసీఆర్ మైదానంలో గురువారం జిల్లా స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ మల్లికార్జున బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీలను ఉదయం 9 గంటలకు స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పోటీలకు ఇప్పటి వరకూ 60 ఎడ్ల బండ్లు నమోదు చేసుకున్నాయి. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

అగళి: మండలంలోని మధూడిలో దుండగులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కురుబ చిక్కన్న భార్య తిమ్మక్క బుధవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఒంటరిగా పొలంలో గేదెలను మేపుతుండగా గమనించిన దుండగులు ఆమె మెడలోని 10 గ్రాముల బరువున్న బంగారు తాళిబొట్టు చైన్ లాక్కొని ఉడాయించారు. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టమాట మండీలో సుంకం వసూళ్ల బంద్

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని టమాట మండీలకు సరుకు తరలించే వాహనాల నుంచి ఇకపై ఎలాంటి సుంకం (పన్నులు) వసూళ్లు చేయకూడదని ఈఓఆర్డీ ఎస్.మాధవి, పంచాయతీ కార్యదర్శి జి.నరసింహారెడ్డి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిట్ పిటిషన్ (నంబర్ -11293/2021) తీర్పు, పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను టమాట మండీ సమీపంలో ఏర్పాటు చేశారు. ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవరైనా అనధికారికంగా రుసుము వసూలు చేస్తే కోర్టు ధిక్కరణ కింద క్రిమినల్ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్లాస్టిక్‌తో పెనుముప్పు

- పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



ప్లాస్టిక్ వ్యర్థాలను తూకం వేయిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం రూరల్: ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని, పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ధర్మవరంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. పట్టణంలోని 40 వార్డుల పరిధిలో వారం రోజుల పాటు స్వయం సహాయక సభ్యులు, కౌన్సిలర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ క్రమంలో సేకరించిన ప్లాస్టిక్‌వ్యర్థాలను కళాశాల మైదానంలోకి తరలించి, తూకం వేశారు. ఈ మొత్తం ప్రక్రియను ఎమ్మెల్యే దగ్గరుండి పర్యవేక్షించారు. ఎక్కువగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సేకరించిన 32వ వార్డుకు చెందిన కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి బృందానికి మొదటి బహుమతిగా రూ.50వేలు, 26వ వార్డుకు చెందిన రాయపాటి రామకృష్ణ బృందానికి రెండో బహుమతిగా రూ.30వేలు, 10వ వార్డు బృందానికి రూ.20వేల ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే విద్యార్థుల విభాగానికి సంబంధించి మొదటి బహుమతిగా రూ.50వేలును బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు. అలాగే జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థులు రూ.30వేలు, ఉషోదయ పాఠశాల విద్యార్థులు రూ.20వేలు పారితోషకాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగడం వల్ల, అలాగే ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు తీసుకెళ్లి భుజించడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదముందన్నారు. భవిష్యత్‌లో పిల్లలకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా గత మూడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులను చైతన్య పరిచేలా త్వరలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సేకరించిన వ్యర్థాలను అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీకి తరలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షేక్ షంషాద్ బేగం, మున్సిపల్ మేనేజర్ ఆనంద్, టీపీఆర్వో సుబ్బరాయుడు, ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరుస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌బాషా, శ్యామ్‌సన్, పార్థసారధి, 40 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో న్యాక్ పర్యటన

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలలో త్వరలో న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ పర్యటించనుంది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ (ఏ) అంతర్గత నాణ్యత మదింపుల కమిటీ (క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్) సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ రూపకల్పన బుధవారం పూర్తయింది. వర్సిటీ సాధించిన ప్రగతి, విద్యార్థుల అడ్మిషన్లు, కోర్సు పూర్తయిన వారికి దక్కిన కొలువులు, వర్సిటీ అందిస్తున్న ప్రామాణిక సాంకేతిక విద్య, నాణ్యమైన పరిశోధన, ముద్రించిన జర్నల్స్, వర్సిటీ ఆవిష్కరణలకు వచ్చిన పేటెంట్లు తదితర వివరాలతో సెల్ఫ్ స్టడీ రిపోర్ట్‌ను రూపొందించారు. తొలుత డిజిటల్ వెరిఫికేషన్ అనంతరం నేరుగా న్యాక్ టీం వర్సిటీని సందర్శించనుంది. గత రెండు సంవత్సరాలుగా రిపోర్ట్‌ను రూపకల్పన చేయడానికి కృషి చేసిన ప్రొఫెసర్‌లను ఈ సందర్భంగా వీసీ జింకా రంగజనార్ధన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ సత్కరించారు.

రూ.2 కోట్ల అపహరణపై కేసు నమోదు

గార్లదిన్నె: పోలీసులమంటూ బెదిరించి రూ.2కోట్లు అపహరించుకెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. ఈ మేరకు గార్లదిన్నె ఎస్ఐ సాగర్ బుధవారం తెలిపారు. మండలంలోని రామదాస్‌పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారులో వెళుతున్న వ్యక్తులను అటకాయించి నగదు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అడ్మిన్ శ్రీపతి, పర్చేజింగ్ మేనేజర్ అనూపకుమార్ మంగళవారం బెంగళూరు నుంచి కంపెనీకి చెందిన రూ.2కోట్లు తీసుకుని డ్రైవర్ శివతో కలసి ఇన్నోవా కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అదే రోజు రాత్రి గార్లదిన్నె మండలం తలగాచిపల్లి వద్దకు చేరుకోగానే మరో ఇన్నోవా కారులో వచ్చిన నలుగురు యువకులు శ్రీపతి ప్రయాణిస్తున్న కారును ఆపి తాము పోలీసులమని నమ్మబలికారు. శ్రీపతి, అనూపమ కుమార్‌ను దింపి, డ్రైవర్ శివతో ఇద్దరు యువకులు ఇన్నోవా కారును రామ్‌దాస్ పేట సమీపంలోకి తీసుకెళ్లి అక్కడ డ్రైవర్ శివను, కారు వదిలి రూ.2 కోట్లు తీసుకుని తమ కారులో అనంతపురం వైపుగా వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

వ్యక్తి దుర్మరణం

తనకల్లు: లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఖాజా (52) బుధవారం ఉదయం తన భార్య షహీన, కుమార్తె యాస్మిన్‌తో కలసి ద్విచక్ర వాహనంపై పెనుకొండలోని బాబయ్య స్వామి దర్గాకు బయలుదేరాడు. తనకల్లు మండలం దేవళంతండా సమీపంలోకి చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న ఖాజా తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. షహీన కాలు విరిగింది. స్వల్ప గాయాలతో యాస్మిన్ బయటపడింది. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గమనించి వెంటనే క్షతగాత్రులను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాంభూపాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జలపాతంలో పడి యువకుడి మృతి

- మహారాష్ట్రలోని సులిఖోర్‌లో ఘటన
- స్నేహితుడి పెళ్లి కోసం ఒమన్ నుంచి వచ్చిన పాటిల్ కార్తీక్



పాటిల్ కార్తీక్ (ఫైల్)

కణేకల్లు: స్నేహితుని పెళ్లిలో అందరూ కలసి సరదాగా గడిపారు. మూడు ముళ్లు పడగానే అంతా కలసి ఎంజాయ్ చేసేందుకు పక్కనే జలపాతం వద్దకెళ్లారు. ఊహించని పరిణామం అందరినీ విషాదంలోకి నెట్టేసింది. జలపాతం వద్ద పాచిపై కాలు పెట్టడంతో అదుపు తప్పి ఇద్దరు యువకులు ఒక్కసారిగా కింద పడ్డారు. అందరూ చూస్తుండగానే విగతజీవులయ్యారు. ఈ ఘటనలో ఒకరు కణేకల్లు మండలానికి చెందిన వారు కావడం గమనార్హం. వివరాలు.. మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన పాటిల్ విజయమ్మ, నాగభూషణం దంపతుల మొదటి కుమారుడు కార్తీక్ (25) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి, ఏడాదిన్నరగా ఒమన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో తనతో పాటు కలసి చదువుకున్న స్నేహితుడి పెళ్లికి హాజరయ్యేందుకు ఆదివారం సొంతూరికొచ్చాడు. తల్లిదండ్రులతో కలసి ఓ రోజంతా సరదాగా గడిపాడు. అనంతరం సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న పెద్దనాన్న కుమారుడిని పలకరించి, అక్కడి నుంచి నేరుగా మహారాష్ట్రలో తన స్నేహితుడి పెళ్లిలో పాల్గొనేందుకు వెళ్లాడు. మంగళవారం స్నేహితులందరూ కలసి సరదాగా గడిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం అక్కడికి సమీపంలో ఉన్న సులిఖోర్ జలపాతం వద్దకెళ్లారు. అక్కడ పాచిపట్టిన రాతిపై కాలు పెట్టడంతో కార్తీక్‌తో పాటు మరో స్నేహితుడు ధనుంజయ్ గైక్వాడ్ జారి కిందపడి, అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రుల రోదనకు అంతు లేకుండా పోయింది.

వివాహిత బలవన్మరణం

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని కొల్లకుంట గ్రామానికి చెందిన సుశీలమ్మ(45) తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఆదినారాయణ బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటిభార్య చనిపోవడంతో సుశీలమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె తరచూ అనారోగ్యానికి గురవుతుండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



నరేంద్ర (ఫైల్)

రొద్దం: తల్లిదండ్రులిద్దరూ మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. రొద్దం మండలం బూచర్లకు చెందిన లక్ష్మీదేవి భర్త కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ క్రమంలో కుమారుడు నరేంద్ర(21)తో కలసి నివాసముంటున్న ఆమె ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉన్న నరేంద్ర.. బుధవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న నరేంద్రను గమనించిన స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు పెనుకొండలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యాయత్నం చేసే ముందు నరేంద్ర రాసిపెట్టిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.6 లక్షల వరకు అప్పుల వివరాలతో పాటు ఆస్తులకు సంబంధించిన వివరాలు రాసి ఉన్నాయి. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పాపం పసికందు

- పీహెచ్‌సీ పక్కనే రోడ్డుపై వదిలేసిన తల్లి
- స్పందించిన వైద్య సిబ్బంది



శిశుగృహ సిబ్బందికి చిన్నారిని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, అనాథగా మారిన చిన్నారి

కుందుర్పి: వారం రోజుల పసికందును ఓ కన్నతల్లి రోడ్డు పక్కన వదిలేసింది. చిన్నారి రోదనలతో అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది వెంటనే స్పందించి చికిత్స అందజేసి, శిశుగృహకు చేర్చారు. వివరాలు... కుందుర్పిలోని పీహెచ్‌సీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి ఓ తల్లి వారం రోజుల వయసున్న మగశిశువును వదిలేసి వెళ్లింది. అర్ధరాత్రి కావడంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. వేకువజామున చిన్నారి ఏడుపు విన్న ఆస్పత్రి సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని శిశువును అక్కున చేర్చుకున్నారు. సమాచార అందుకున్న డాక్టర్ అనూష అక్కడకు చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రాణాపాయ స్థితి నుంచి చిన్నారిని కాపాడారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పీహెచ్‌సీకి చేరుకుని చిన్నారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ సూచన మేరకు పోలీసుల పర్యవేక్షణలో అనంతపురంలోని శిశుగృహకు శిశువును చేర్చారు. కాగా, ఆస్పత్రిలో శిశువు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న పలువురు అక్కడకు చేరుకుని ఆ చిన్నారిని తమకిస్తే పెంచుకుంటామంటూ అధికారులను అభ్యర్థించారు.